# కొత్త ముఖాలు

సుస్నాతా రమణ మూర్తి




రాత్రి తొమ్మిది గంటలు దాటింతర్వాత హోటల్లో భోజనంచేసి ప్రక్కనున్న కిళ్ళీకొట్టు దగ్గర కింగ్ సైజు సిగరెట్ వెలిగించి, కిళ్ళీకోసం వెయిట్ చేస్తూ సిగరెట్ పొగని రింగులు రింగులుగా వదలసాగేడు రంగనాథం.

రంగనాథం ఆ మహా నగరానికి ఆఫీసు పనిమీద ఆ రోజే వచ్చేడు. అన్నీ కొత్త ముఖాలు — కొత్త పరిసరాలు కావడంతో అదోలా ఫీలవ సాగేడు తను.

కిళ్ళీకొట్టు వాడు కిళ్ళీ అందించాడు.

కిళ్ళీ వేసుకుని ముందుకి వెళ్దా మనుకున్నంతలో "సార్! ప్లీజ్ హెల్ప్ మీ! విజయవాడ నుంచి వచ్చాను. మా వాళ్ళు బెంగుళూరులో ఉన్నారు. రైల్లో నా సామానుతోబాటు డబ్బు కూడా పోయింది. పొద్దుట్నుంచీ ఏమీ తినలేదు. ఒక రూపాయుంటే ఇప్పించండి సార్!" అంటూ ఒక పాతికేళ్ళ యువతి దీనంగా అర్థిస్తూ కన్పించింది.

ఆమె నీట్‌గా ఉంది.

నాజూగ్గా ఉంది.

సంసార పక్షపు స్త్రీలా కన్పిస్తోంది.

తప్పనిసరై అలా అర్థించాల్సొచ్చినందుకు బాధపడుతున్నట్లుగా ఉంది.

ఉదయం నుంచీ స్వచ్ఛమైన తెలుగుమాటలు వినడానికి నోచుకోని రంగనాథంకి ఆమె మాటలు వినేసరికి ప్రాణం లేచివచ్చినట్లయింది.

"పాపం, సామాన్లతోబాటు డబ్బుకూడా పోయింది. బెంగుళూరు వెళ్ళాలంటే ఓ ఇరవై రూపాయలైనా ఉండాలి. అంత తనెలాగూ ఇవ్వలేడు. పోనీ తనడిగినట్లు ఒక రూపాయి ఇస్తేనో?..."

"సార్!" మళ్ళీ ఆమె అభ్యర్థన.

"ఏమో! ఈ రోజుల్లో ఎంతమంది తమ మాయమాటలతో మోసం చేయటం లేదు? తను కూడా అలాంటి బాపతేనేమో? పాపం ఆడది! ముఖం చూస్తుంటే తనలాంటిది కాదనిపిస్తోంది. ఒక రూపాయే కదా తనడిగింది? ..."

రంగనాథం ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయ్.

ఒక రూపాయి తీసిచ్చాడు.

ఆమె ముఖంలో సంతోషం, కళ్ళలో కృతజ్ఞత చోటు చేసుకున్నాయి.

"థాంక్సండీ!" అంటూ ఆ నా రూపాయి తీసుకుంది.

రంగనాథం ఆమె కళ్ళల్లో ఇదివరకటి దైన్యం పోయి సంతోషం నిండినందుకు గర్వంగా భుజా లెగరేస్తూ ముందుకి సాగిపోయాడు. తనుంటున్న లాడ్జివేపు హుషారుగా నడవ సాగేడు.

ఒక చీకటి సందులో తన వెనకాలో ఎవరో వస్తున్నట్లు గమనించి వెనుతిరిగి చూశాడు తను.

ఆ యువతి తన వెనుకే వస్తోంది.

రంగనాథం ఆగి వెనక్కి తిరగడంతో తను కూడా ఆగిపోయింది.

"ఇంకా తనెందు కిలా తనను అనుసరిస్తోంది!?" రంగనాథంలో ఆశ్చర్యంతో కూడిన అనుమానం తలెత్తింది.

కొన్ని క్షణాలు మౌనంగా నడిచాయ్.

ఆమెలో చలనం చోటు చేసుకుంది. అడుగులో అడుగువేస్తూ రంగనాథం దగ్గరకు వచ్చి సంకోచంగా, బిడియంగా అంది: "సార్, మీరేమీ అనుకోనంటే నా దొక రిక్వెస్టండీ. మీరు చాలా మంచివారులా

కనిపించారు. మొదటిసారిగా నా కష్టాన్ని మీతోనే చెప్పుకున్నాను. మీరు నన్ను అర్థం చేసుకున్నారు. ఇక్కడంతా నాకు కొత్తగా ఉంది. ఆకలి బాగా వేస్తోంది. హోటల్లోకి వెళ్ళడానికి భయంగా ఉంది. దయచేసి నా కిచ్చిన ఈ రూపాయితో ఇడ్లీలు తెచ్చి పెట్టండి."

ఆమె లోని భయానికి మందహాసం చేస్తూ రూపాయి తీసుకున్నాడు రంగనాథం. దగ్గరలో ఉన్న హోటల్లోకి వెళ్ళి ఇడ్లీలు కట్టించి తీసుకొచ్చి "తీసుకోండి" అంటూ ఆమెకు అందించ బోయాడు.

"ఏమిటండీ ఇది?" ఆశ్చర్యపోతూ గట్టిగా అరుస్తున్నట్లు అడిగింది తను.

"ఇడ్లీలు తెమ్మన్నారు కదండీ?" ఆశ్చర్యంగా అన్నాడు తను.

రంగనాథం రెండు చేతుల్ని గట్టిగా పట్టుకుని "ఇప్పుడు నేనేమి చేసేది దేవుడా?" అంటూ గట్టిగా ఏడవసాగింది తను.

"ఏమిటి? ఏం జరిగింది?" అన్న భావాన్ని వ్యక్తం చేస్తూ కొన్ని తలలు అర్జంటుగా గుమి కూడాయ్.

అనుకోని ఈ సంఘటనకి అవాక్కైపోయాడు రంగనాథం. ఆశ్చర్యంతో నోట మాట రావటం లేదు తనకు.

"ఏంది సామీ? ఏం జరిగిందీ?" అంటూ అక్కడ చేరిన తలకాయలు తన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడుగుతూంటే రంగనాథంకి ఏం చెప్పాలో తోచక, "ఏమిటమ్మా ఇదంతా?" అంటూ ఆమె ముఖం లోకి చూడసాగాడు.

"ఏమమ్మా. ఏం జరిగింది?" ఒక తల ఆమె కేసి చూస్తూ అడిగింది.

"ఏం చెప్పను బాబూ! ఈ బాబు మాయ మాటలు నమ్మి నాలుగు రోజుల క్రితం నా వూరిని, నా వాళ్ళని వదిలేసి ఈ వూరొచ్చాను. ఇప్పటి దాకా నన్ను బాగానే చూసుకున్నారు. ఇప్పుడేమో. . ."దుఃఖంతో గొంతు బొంగురు పోగా రంగనాథం చేతుల్ని వదిలేసి పైట కొంగుతో కళ్ళొత్తుకుంటూ వెక్కి వెక్కి ఏడవ సాగిం దామె.

"ఏందమ్మా అలా ఏడుస్తుండావ్? ఈ సామేం జేశాడో చెప్పు." మరో తల కుతూహలంగా అడిగింది.

"ఏం చెప్పను బాబూ! నాలుగు రోజులు నాతో అన్ని సరదాలు తీర్చుకుని ఇప్పుడీ ఇడ్లీ పొట్లం తీసుకుని నన్ను పొమ్మంటున్నాడు బాబూ." భుజాల నిండుగా పమిటను కప్పుకుంటూ చెప్పింది తను

"అన్నన్నన్న! ఎంత మోసం, ఎంత మోసం. రాంభ అన్నియాయం సార్! ఆడకూతుర్నిలా చేయడం నీకి బాగుంది సామీ?" అంటూ ఒక తల ఆశ్చర్యపోయింది.

మిగతా తలలుకూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఐకమత్యంగా ఆశ్చర్యపోయాయ్.

'జరిగిన విషయం ఇదీ' అని చెప్పడానికి రంగ నాథంకి అవకాశం లేకుండా పోయింది.

తల లన్నీ చీవాట్లు, అక్షింతలు వేయసాగాయ్.

ఇంతమందిలో ఏ ఒక్కరైనా 'జరిగిందేమిటండీ' అని తనను అడక్క పోయేసరికి రంగనాథంలో ఒక అనుమానం తలెత్తింది.

'బహుశా వీళ్ళంతా ఒక గాంగేమో? ఈ గాంగ్ తాలూకా మనిషేమో ఈవిడ? తన లాంటి కొత్త ముఖాల్ని పీడించడమే వీళ్ళ వృత్తేమో?. . ."

"సామీ! చూడ్డానికి పెద్దమనిషిలా కనిపిస్తున్నావ్, ఇలా చేయడానికి నీ మనసెలా ఒప్పింది?.. ."

"ఇలా వూరుకుంటే లాభం లేదు. పోలీస్ స్టేషన్‌కి పదండి."

"అవునవును, ఇలాంటి సాములకు అదే మంచిది."

తలలు రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నాయ్.

"పోలీస్ స్టేషన్ అనే సరికి రంగనాథంలో భయం. చోటుచేసుకుంది. ఉన్న వూరు కాదు. ఒక ఆడదాని విషయంలో పోలీస్ స్టేషన్‌కి వెళితే తన పరువేం కాను?"...

ఏం చేయాలిప్పుడు? ఎలా ఈ గొడవ నుంచి బయటపడ్డం?? ...

ఆలోచనలతో రంగనాథం మస్తిష్కం క్షణ క్షణానికి వేడెక్కిపోసాగింది.

"పోలీస్ స్టేషన్‌కి ఎందుకు సామీ? లేనిపోని గొడవ? వాడో అయిండియా నాల్రోజులు అనుభ వించావు కదా? దాని ముఖాన ఒక వంద పారేయ్ దాని దారేదో అది చూసుకుంటుంది" ఒక తల రంగనాథం చెవిలో గొణిగింది.

వంద రూపాయలు అనే సరికి రంగనాథం గుండె గుబేల్మంది. చేయని నేరానికి. జాలిపడి రూపాయి సహాయం చేసిన దానికి! ఇంకా జాలిపడి ఇడ్లీలు తీసుకొచ్చిన పాపానికి వంద రూపాయలు ఇచ్చు కోవాలా? ... లేకుంటే పోలీస్ స్టేషన్‌కా? ... పోలీస్ స్టేషన్‌కి నిజంగా వీళ్ళు వస్తారా? ... తన జేబులో అంత డబ్బెక్కడుంది? ... ఉన్నదంతా ఇచ్చేస్తే ఎలా? ... ...

"ఏంటి సామీ మాట్లాడవేం?" తలలన్నీ కోరస్‌గా అడిగాయ్.

ఆ యువతి ఇంకా కుళ్ళి కుళ్ళి ఏడుస్తూనే ఉంది.

"నీవు కాదు తల్లీ! ఆడదానివి కదా అని జాలి పడినందుకు, ఆ ఏడ్పేదో నే నేడవాలి న్యాయంగా" బాధపడ్డాడు రంగనాథం.

నిముషాలు ముందుకి దొర్లిపోతున్నాయి.

తలల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

చేయని నేరానికి అంత మంది మధ్య దోషిలా నిలబడాల్సి వచ్చినందుకు తన దురదృష్టాన్నినిందించు కోసాగేడు రంగనాథం.

"అంతా డబ్బిచ్చేయండి సామీ! ఏ గొడవా ఉండదు. అంటున్నారే తప్ప ఏ ఒక్కడికి తన పరిస్థితి గురించి ఆలోచించాలని గాని, — తెలుసుకోవాలన్న కుతూహలం గాని లేకపోవడంతో పది రోజుల క్రితం 'క్రొత్త ముఖాలు' శీర్షికతో ఒక ఇంగ్లీషు పేపర్లోని వార్త రంగనాథానికి ఆ క్షణంలో గుర్తొచ్చింది.

ఇలానే ఒక ఆడదాన్ని అడ్డు పెట్టుకుని డబ్బు చేసుకోబోయిన ఒక ముఠాని ఎదుర్కోబోయిన ఒక యువకుని హత్యా వైనం తల్చుకుని నిలువెల్లా వణికిపోయాడు రంగనాథం.


"ఈ సామి మన మాటలు వినేట్టు లేడు. పోలీస్ స్టేషన్‌కి తీసుకుపోదాం పదండి" ఒక తల తొందర పడుతోంది.

"పోలీస్ స్టేషన్‌కి ఎందుకూ? ఎంతుంటే అంత ఇచ్చేసి పో సామీ! పోలీసులతో గొడవ మనకెందుకు?"

"ఒక యాభై ఉందా? చాల్లే! ఎలాగోలా నచ్చ చెబితే వినుకుంటుంది."

తలల ఆలోచనలన్నీ డబ్బు చుట్టూ తిరుగు తున్నాయ్.

రంగనాథం మాత్రం 'ఎలా వీరి బారి నుండి తప్పించుకోడం?' అన్న విషయం గురించి తీవ్రంగా




ఆలోచిస్తున్నాడు. అలా రంగనాథం ఆలోచనల్లో తేలుతున్నంతలో ఒక హెడ్ కానిస్టేబుల్ వాళ్ళ దగ్గరకు వచ్చాడు!" ఏం, దప్పి ఏం జరిగింది?' అంటూ.

తలలన్నీ విషయాన్ని విపులీకరించాయ్. ఆ యువతి శోకం మరింత హెచ్చింది.

కోపంగా, అనుమానంగా హెడ్‌గారు రంగనాథం ముఖంలోకి చూస్తూ గుంపు నుండి ఒక మూడు గజాల దూరం తీసుకుపోయి, "ఏందప్పా ఇదంతా?" అంటూ అడిగాడు రంగనాథాన్ని.

రంగనాథం అదో ఇదో మంటూ జరిగింది చెప్పాడు.

"సమయానికి మీరు ఆపద్బాంధవునిలా వచ్చారు. ఆ మోసగాళ్ళ బారి నుండి నన్ను రక్షించండి" అంటూ వేడుకున్నాడు.

"మీరు చెప్పింది కాదన లేనుకోండి. వాళ్ళంతా మోసగాళ్ళని ప్రూవ్ చేసేదెలా? అంతా ఆ అమ్మడికి సపోర్టు చేస్తున్నారే? వాళ్ళని, మిమ్మల్ని స్టేషన్‌కి తీసుకెళ్ళి కేసు పెడితే కోర్టు దాకా వెళుతుం దీ వ్యవహారం. కోర్టుకి చెవులే కాని కళ్ళుండవని మీకు మాత్రం తెలియదా?"

"అంతే నన్నేం చేయమంటారు?" ఆశ్చర్య పోయాడు రంగనాథం.

"ఇలాంటి గొడవల్లో మీ లాంటి కొత్తవాళ్ళు తల దూర్చనే కూడదు. దూర్చిం తరవాత చేసే దేముంది? వాళ్ళన్నట్లు మీకు తోచినంత ఆ అమ్మడి ముఖాన కొట్టేయడమే మంచిది.ఏ గొడవా ఉండదు."

హెడ్‌గారి మాటలకి రంగనాథం మరోసారి ఆశ్చర్యపోయాడు. అక్రమాన్ని అరికట్టాల్సిన తను కూడా వాళ్ళనే సమర్థిస్తుంటే చేసేదేమీ లేక బాధ పడసాగాడు.

బహుశా ఈ హెడ్‌కీ వీళ్ళతో లావాదేవీ లున్నాయేమో?అందుకనే వాళ్ళని సమర్థిస్తున్నాడేమో? అన్న అనుమానం కలిగింది రంగనాథంకి.

వీళ్ళ బారి నుండి తప్పుకోవడం సాధ్యపడేట్టు లేదు. ఎంతో కొంత ఇవ్వక తప్పదులా ఉంది ... అలా రంగనాథం ఆలోచనలు సాగిపోతున్నంతలో కారు హారన్ పెద్దగా వినిపించింది.

తలలతో బాటు రంగనాథం, ఆ యువతి ఆ వేపు చూశారు.

పులి వాత పడబోతున్న మేక పిల్లల్లా ఆ యువతితో పాటు తల లన్నీ పక్క సందులోకి పరుగు తీశాయ్

రంగనాథం ఒక్కడూ మిగిలి పోయాడు.

హెడ్‌గారి పత్తా కూడా లేదు.

హడావుడిగా పారిపోవడం వల్ల హెడ్‌గారి టోపీ మాత్రం పక్కన పడి ఉంది.

నిజంగా తను హెడ్ కాదేమో! కాకీ గుడ్డ లేసుకొచ్చిన వాళ్ళ మనిషేమో? అంతా కలిసి నాటకం ఆడారేమో? . రంగనాథం అలా ఆలోచించి ఆశ్చర్యపోయాడు.

అనుకోనివిధంగా గండం గడిచి నదుకు సంతోషించాడు. తన దృష్టిని ఆకర్షించిన కారు మీద ఎర్రక్షరాలు అర్థం కాకపోయినా, అందులోంచి దిగిన పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని చూసి పరిస్థితిని అర్థం చేసుకోగలిగాడు రంగనాథం. *